రేపు చేవెళ్లలో స్వామి వివేకానంద విగ్రహా ఆవిష్కరణ

- హాజరు కానున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

చేవెళ్ల, జనవరి 10 : ఈ నెల 12న శుక్రవారం చేవెళ్లలో స్వామి వివేకానంద విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందని సర్పంచ్ బండారు శైలజా ఆగిరెడ్డి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ విగ్రహ ఆవిష్కరణకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డిలు హాజరు కానున్నారని చెప్పారు. ఈ విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమం ఉదయం 11గంటలకు ప్రారంభం అవుతుందన్నారు.



చేవెళ్లలో ప్రత్యేక క్లాసులు వింటున్న విద్యార్థులు

పదికి ప్రత్యేక బోధన

విద్యార్థులకు పదో తరగతి తొలిమెట్టులాంటిది. వారి బంగారు భవిష్యత్‌కు దశ, దిశను నిర్దేశించేది పదో తరగతే. పదో తరగతిలో ప్రతిభ కనబర్చితే విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాట పడుతుంది. వారి జీవితంలో విలువైన పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడం అనుకున్నంత సులువు కాదు. దీనిని అధిగమించేందుకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు వినూత్న తరహాలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తూ విద్యను అందిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మంచి ఫలితాలను సాధించేలా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ప్రణాళికలను సిద్ధం చేసుకొని ముందుకు సాగుతున్నారు.

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జనవరి 10 : జిల్లాలో ఈ ఏడాది పదో తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు జిల్లా విద్యాశాఖ పక్కా ప్రణాళిక సిద్ధం చేసింది. డిసెంబరు చివరి నాటికి సిలబస్ పూర్తి కావడంతో.. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో 234 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా 48వేల మంది విద్యార్థులు ఈసారి పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. దీని కోసం విద్యార్థులకు పాఠశాలల్లో ముందస్తుగా అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కాల నిర్ణయ పట్టికతో పాటు ప్రతిరోజు ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు సాయంత్రం 4.45 గంటల నుంచి 5.45 గంటల వరకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఎక్కువ మార్కులు వచ్చేందుకు అవగాహన కల్పిస్తున్నారు. రోజుకో పరీక్ష నిర్వహించి బిట్స్ ఎలా రాయాలో ప్రిపేర్ చేయిస్తున్నారు. విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు. ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. విద్యార్థులు ఆయా సబ్జెక్టుల్లో సునాయాసంగా టెస్టులు రాయటమే కాకుండా మొదటి స్లిప్ టెస్టు కంటే ఆపై నిర్వహించే స్లిప్ టెస్టుల్లో ప్రగతి సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. స్లిప్ టెస్టుల ద్వారా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి సులువుగా అర్థమయ్యే విధంగా పాఠ్యాంశాలపై, ఆబ్జెక్టివ్ ప్రశ్నలు, లఘు తరహా ప్రశ్నలకు సమాధానాలు రాయగలిగే విధంగా ముందుకు సాగుతున్నారు.

వంద శాతం ఉత్తీర్ణత కోసం తపన
వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

పదో తరగతి విద్యార్థులకు జనవరి రెండో తేదీ నుంచి ఉదయం, సాయంత్రం రెండు గంటల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8.30 గంటలకు ప్రత్యేక క్లాస్ నిర్వహిస్తున్నారు.

ఏడేళ్లుగా పదో తరగతి ఉత్తీర్ణత వివరాలు

సంవత్సరం	హాజరు	ఉత్తీర్ణత	శాతం
2015	88,208	61,814	70.10
2016	90,607	74,360	82.09
2017	42,706	36,164	84.68
2018	43,392	37,809	87.13
2019	45,747	42,467	92.83
2022	47,157	42,460	90.04
2023	47,551	41,488	87.25

స్నాక్స్ ఎప్పుడు?

ఉదయం బ్రేక్‌ఫాస్ట్ పథకం చాలాచోట్ల అమలు కావడం లేదు. మధ్యాహ్నం భోజనం తర్వాత సాయంత్రం ప్రత్యేక క్లాసులో విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారు. ఆకలితో టీచర్ చెప్పే క్లాసులు సరిగ్గా వినడం లేదు. కొన్నిచోట్ల దాతలు ముందుకు వచ్చి స్నాక్స్ అందిస్తున్నారు. సాయంత్రం వేళలో ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న వారికి ప్రభుత్వం త్వరగా నిధులు మంజూరు చేసి స్నాక్స్ అందించాలని విద్యార్థులు కోరుతున్నారు.

అర్థమయ్యేలా చెబుతున్నారు.



నేను మ్యాథ్స్‌లో కొంచెం వీక్. అయినప్పటికీ.. సార్ ఒకటికి రెండు సార్లు చెబుతున్నారు. బోర్డుపై లెక్కలు చేయిస్తున్నారు. ఎప్పటికప్పుడు టెస్టులు నిర్వహిస్తున్నారు. మ్యాథ్స్‌తో పాటు ఇంగ్లీష్, సైన్స్ బాగా అర్థమవుతుంది. 10/10 గ్రేడ్ సాధించేలా కష్టపడుతున్నాను.

- మెహరిన్, విద్యార్థిని, ఊరెళ్ల ఉన్నత పాఠశాల

సార్లు బాగా చెబుతున్నారు



మ్యాథ్స్, ఇంగ్లీష్, సైన్స్ టీచర్లు బాగు చెబుతున్నారు. అర్థం కాకుంటే ఒకటికి రెండు సార్లు బోధిస్తున్నారు. ఎప్పటికప్పుడు టెస్టులు పెట్టి మార్కులు తక్కువగా వస్తే.. అదే సబ్జెక్టులో మార్కులు సాధించేలా చెబుతున్నారు. వంద శాతం మార్కులు వస్తాయనే నమ్మకం కలుగుతుంది.

- ఆదిభ, విద్యార్థిని, ఊరెళ్ల ఉన్నత పాఠశాల

మెరుగైన ఫలితాల కోసం ప్రత్యేక తరగతులు



డిసెంబరు చివరి వరకు సిలబస్ పూర్తి చేశాం. జనవరి 2వ తేదీ నుంచి ప్రత్యేక క్లాసులు ప్రారంభించాము. మెరుగైన ఫలితాల సాధన కోసం ఉదయం, సాయంత్రం వేళలో గంట చొప్పున ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాము. గత విద్యాసంవత్సరం ప్రైవేట్‌కు ధీటుగా ఫలితాలు సాధించాము ఈ సారి కూడా వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తున్నాము.

- మహ్మద్ ఇలియాస్, ఊరెళ్ల హెచ్‌ఎం, చేవెళ్ల

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థి వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పక్కా ప్రణాళికతో ప్రత్యేక తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాము. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా వార్షిక ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు ఎక్కువ మంది విద్యార్థులు 10/10 గ్రేడ్ సాధించేలా కృషి చేస్తున్నాం. జిల్లా కలెక్టర్ సూచనలు, సలహాలతో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాము.

- సుశీందర్‌రావు, జిల్లా విద్యాశాఖ అధికారి

వ్యవసాయ మార్కెట్ కమిటీల పీఠం ఎవరిదో!

- 9 సంవత్సరాలుగా చక్రం తిప్పిన బీఆర్ఎస్ నేతలు
- మార్కెట్ కమిటీలను రద్దు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఆశల పల్లకీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు
- ఎవరికి దక్కుతాయోనని ఉత్కంఠ



చేవెళ్ల, జనవరి 10 : చేవెళ్ల నియోజకవర్గ పరిధిలో వ్యవసాయ మార్కెట్ కమిటీల పీఠం ఎవరికి దక్కుతుందోనన్న చర్చ జోరుగా సాగుతోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల తరువాత చేవెళ్ల నియోజకవర్గం పరిధిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలు అన్నీ కాంగ్రెస్ నేతల చేతుల్లోకి రానున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుతో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కాంగ్రెస్ నాయకులకు కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. రాష్ట్రంలో ఉన్న అన్ని కార్పొరేషన్లు, నామినేటెడ్ పదవులను ప్రభుత్వం ఇప్పటికే రద్దు చేసింది. వీటితో పాటు ప్రస్తుతం ఉన్న మార్కెట్ కమిటీలను సైతం రద్దు చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో కాంగ్రెస్ పార్టీ నేతల్లో ఆశలు మరింత రేకెత్తిస్తున్నాయి. రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి రావడంతో ఇకపై తమకు దక్కాల్సిన నామినేటెడ్ పదవులపై కాంగ్రెస్ నేతలు దృష్టి సారిస్తున్నారు. మార్కెట్ కమిటీలు, పంచాయతీ, మండల స్థాయిలో ఉండే ప్రొటోకాల్ పదవులపై కాంగ్రెస్ నేతలు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేని పదేళ్ల కాలం పాటు కష్టకాలంలో కూడా పని చేశామని.. ఇప్పుడు రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చింది కాబట్టి నామినేటెడ్ పదవులతో తమకు న్యాయం చేయాలని పార్టీ నాయకులు పార్టీ పెద్దల వద్ద తమ వాదనలను వినిపించేందుకు సిద్ధమవుతున్నారు.

ఎవరికి వారే ప్రయత్నాలు..

చేవెళ్ల నియోజకవర్గంలో వ్యవసాయ మార్కెట్ కమిటీలో పోస్టులు దక్కించుకునేందుకు ఎవరికి వారుగా పైరవీలు ప్రారంభించారు. చేవెళ్ల నియోజకవర్గంలో చేవెళ్ల, శంకర్‌పల్లి, సర్దార్‌నగర్, నవాబ్‌పేట్ తదితర వ్యవసాయ మార్కెట్ యార్డులు ఉన్నాయి. ఈ మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న ఆయా మండలాల్లోని కాంగ్రెస్ నేతలు చైర్మన్‌లు, వైస్ చైర్మన్, డైరెక్టర్ల పదవులు దక్కించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అయితే మార్కెట్ కమిటీ చైర్మన్‌ల యోగం ఎవరిని వరిస్తోందోనని స్థానికులు, నాయకులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.



ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు



సినీనటి అనన్యతో సెల్ఫీ దిగుతున్న యువతులు, మహిళలు



ప్రథమ స్థానంలో నిలిచిన ముగ్గు వద్ద మహిళలు

ముగ్గుల హరివిల్లు

ఉత్సాహంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్



ముగ్గు వేస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరాబ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్: స్వర్గసీమ సుకేతన) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్స్‌లో పోటీదారులు వేసిన ముగ్గులతో ఇంద్రధనస్సు నేలకు దిగి వచ్చిందా అనిపించింది. తెలంగాణవ్యాప్తంగా 45 కేంద్రాల్లో పోటీలు జరగగా, ఉమ్మడి జిల్లా నుంచి ఒకరు ఫైనల్స్‌లో తమ ముగ్గులతో పోటీ పడ్డారు. సినీనటి అనన్య నాగళ్ల, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినితో పాటు కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ముగ్గు వేస్తున్న కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి



ముగ్గులను పరిశీలిస్తున్న అతిథులు





సినీనటి అనన్య



ముగ్గులు వేస్తున్న మహిళలు





అతిథులకు స్వాగతం పలుకుతున్న ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్, స్టేట్ బ్యూరో చీఫ్ ఉప్పులూరి మురళీకృష్ణ

పరిగిలో వంట గ్యాస్ కష్టాలు

● రీఫిల్ కోసం వినియోగదారుల పడిగాపులు



పరిగిలో వంటగ్యాస్ సిలిండర్ల కోసం వేచి ఉన్న వినియోగదారులు

పరిగి, జనవరి 10: పరిగిలో మళ్లీ వంటగ్యాస్ కష్టాలు మొదలయ్యాయి. కొన్నేళ్ల పాటు ఇబ్బందులు రీఫిల్ సిలిండర్లను సరఫరా చేశారు. ఇటీవల వంటగ్యాస్ కోసం వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. రీఫిల్ సిలిండర్ కోసం పడిగాపులు కాస్తున్నారు. పరిగిలో గోదాం లేదు, గ్యాస్ ఆటో ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. గోదాం నుంచి తెచ్చుకుందామంటే 12కిలోమీటర్ల దూరం అని, ఆటోల ద్వారా సరఫరా సరిగా లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారుడి ఇంటికి వద్దకు తెస్తే రూ.30, పై అంతస్తులకు తీసుకెళ్తే రూ.50 ఎక్కువ తీసుకుంటున్నారు. గ్యాస్ ఏజెన్సీ వద్ద గంటల తరబడి పడిగాపులు కాస్తున్నా సిలిండర్ ఇవ్వడం లేదు. నిజానికి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న రెండు మూడు రోజుల్లో రీఫిల్ సిలిండర్ వినియోగదారుల ఇంటికి ఉచితం సరఫరా చేయాల్సి ఉంటుంది. 8కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ఉంటేనే నామమాత్రంగా డెలివరీ చార్జి తీసుకోవాలి. కానీ ఇక్కడ గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు, డెలివరీ బాయ్స్ ఎవరూ రూల్ పాటించడం లేదు. వినియోగదారుల నుంచి ఇష్టానుసారం డబ్బు వసూలు చేస్తున్నా పట్టించుకునే నాథుడు లేకుండా పోయారు. పౌర సరఫరాల అధికారులు స్పందించి గ్యాస్ సరపరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని పరిగి పట్టణ, గ్రామీణ వినియోగదారులు కోరుతున్నారు.

ప్రాణం తీసిన చికెన్ ముక్క!

- భోజనం చేస్తుండగా గొంతులో ఇరుక్కున్న ముక్క
- ఆస్పత్రికి తరలింపు.. అప్పటికే మృతి



జితేందర్‌కుమార్ వర్మ(ఫైల్)

షాద్‌నగర్, జనవరి 10: భోజనం తింటుండగా గొంతులో చికెన్ ముక్క ఇరుక్కొని ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్టలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన జితేందర్ కుమార్‌వర్మ(46).. ఎలికట్టలోని తన స్నేహితుడు ధర్మేందర్ తివారితో కలిసి కూలి పనులు చేసుకుంటూ జీవనంసాగిస్తున్నాడు. మంగళవారం పని పూర్తయిన తర్వాత ఇంటికి వెళ్లి చికెన్ వండుకొని స్నేహితుడితో కలిసి భోజనం చేస్తూ ఒక్కసారిగా కింద పడిపోయాడు. ధర్మేందర్ స్థానికుల సహాయంతో జితేందర్‌ను షాద్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. చికెన్ ముక్క గొంతులో ఇరుక్కుపోవడంలో వల్లనే జితేందర్ మరణించడని పోస్టుమార్టం నివేదికలో తేలింది.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



తాండూరు రూరల్, జనవరి 10 : కరన్‌కోట్ ప్రభుత్వ పాఠశాలలో పీఆర్టీయూ టీఎస్-2024 క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు డి.రవికుమార్, సుశీల, అనిల్‌కుమార్, బాలకృష్ణ, విజయకుమార్, నరేందర్, రాజేశ్వర్, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్, రమేష్‌కుమార్, ప్రభు, బాలరాజ్, భానుప్రకాష్, మనోహర్, మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈటల రాజేందర్‌ను కలిసిన బీజేపీ నాయకుడు



పూడూరు, జనవరి 10:వికారాబాద్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు మల్లేష్ పటేల్ బుధవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మల్లేష్ సెన్సార్ బోర్డు సభ్యుడిగా నియమితులైనందున ఈటలను కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ నర్సింహ, నాయకులు రాఘవేందర్, జంగయ్య, సుభాన్, శ్రీశైలం, సత్యనారాయణ పాల్గొన్నారు.

వ్యవసాయ పరిశోధన స్థానాన్ని సందర్శించిన మహారాష్ట్ర రైతులు

తాండూరు, జనవరి 10: తాండూరులోని వ్యవసాయ పరిశోధన స్థానాన్ని బుధవారం మహారాష్ట్ర ఔరంగాబాద్ జిల్లా రైతు ఉత్పత్తి సంఘాలకు చెందిన 30మంది ప్రతినిధులు సందర్శించారు. కంది, కుసుమ, జొన్న పంటల పరిశోధన ఫలితాల గురించి తెలుసుకున్నారు. పరిశోధన స్థానం హెడ్ సుధారాణి శాస్త్రీయ పద్ధతిలో సాగు చేస్తే అధిక దిగుబడులు పొందొచ్చని రైతులకు వివరించారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ.. పంటను నేరుగా మార్కెట్‌లో అమ్మేకంటే వాటిని ప్రాసెసింగ్ చేసి అమ్మితే అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. శాస్త్రవేత్తలు రాజేశ్వర్‌రెడ్డి, లక్ష్మణ్ పత్తిసాగులో పాటించాల్సిన మెలకువలు, చీడపీడల నివారణపై వారికి వివరించారు.

డ్రగ్స్, గంజాయి కట్టడికి చర్యలు తీసుకోవాలి

- పాఠశాలల పరిసరాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టాలి
- బాలల హక్కుల సంక్షేమ సంఘం డిమాండ్

రంగారెడ్డి అర్బన్, జనవరి 10 : రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించిన డ్రగ్స్, గంజాయి మాఫియాను వెంటనే అరికట్టాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండు కిష్టయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇ.రఘునందన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొత్తూరు మండలంలో గంజాయి చాక్లెట్లను విద్యార్థులకు అలవాటు చేయాలని చూసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. డగ్స్ మాఫియా చివరకు చిన్నారులను కూడా వదలడం లేదన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను టార్గెట్ చేసుకుని రూ.కోట్ల వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. దశాబ్ద కాలం నుంచి ఇది తీవ్రరూపం దాలుస్తోందని, నార్కోటిక్స్, డ్రగ్ కంట్రోల్, పోలీస్ నిఘా విభాగం సంయుక్తంగా సెర్చ్ ఆపరేషన్‌లు తీవ్రం చేయాలని, డ్రగ్స్ మాఫియా కబంధహస్తాల నుంచి రేపటితరం విద్యార్థులను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాలలకు వచ్చే పేద మధ్యతరగతి కి చెందిన విద్యార్థులకు అనేక రకాలుగా ప్రలోభాలకు గురుచేసి ఈ మత్తుమందుల దందాలోకి లాగుతున్నారని తెలిపారు. గతంలో సింగరేణి కాలనీలో జరిగిన ఘటన పూర్తిగా గంజాయికి అలవాటుపడి బానిసైన నాగరాజు అనే యువకుడు అత్యాచారం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఎక్కువగా పేదలు నివసించే బస్తీలలో, వాటి చుట్టుపక్కల ఉండే పాఠశాలల సమీపంలోని పాన్‌షాపులు అడ్డాగా ఈ దందా నడుస్తోందని తెలిపారు.

11.14 క్వింటాళ్ల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం

- ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

వికారాబాద్, జనవరి 10 : కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీరాయుళ్ల గుట్టురట్టు చేశారు వికారాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు. విక్రయించేందుకు సిద్ధం చేసిన 11.14 క్వింటాళ్ల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని సంబంధిత ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. బుధవారం పోలీసు స్టేషన్ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఎస్పీ కోటిరెడ్డి వెల్లడించారు. బుధవారం ఉదయం 7.30 గంటల సమయంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి ప్రశాంత్‌వర్ధన్, వికారాబాద్ సీఐ శ్రీనివాస్ తమ బృందాలతో వికారాబాద్ జిల్లా కేంద్రంలోని డైమండ్ హోటల్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఆ మార్గంలో వెళుతున్న ట్రాలీ ఆటో (టీఎస్06 యూబీ 6749)లో ఓ వ్యక్తి హైఫైవ్, టేస్టీ కింగ్ టైగర్ పేరుతో ఉన్న అల్లం, వెల్లుల్లి పేస్ట్ డబ్బాలను గుర్తించారు. విచారించగా నిందితుడు రాజేంద్రనగర్‌లోని ఉప్పర్‌పల్లికి చెందిన మనుష్ అని, అతను హైదరాబాద్ అత్తాపూర్‌లో హ్యాపీ హోమ్స్ టవర్స్‌లో నివాసం ఉండే అజిత్‌చరణ్య నుంచి కల్తీ అల్లం, వెల్లుల్లి కొనుగోలు చేసి విక్రయిస్తుంటానని చెప్పాడు. ఐదు కిలోల పేస్ట్ డబ్బాను రూ.200లకే విక్రయిస్తున్నట్లు చెప్పడంతో అనుమానం వచ్చిన పోలీసులు...అజిత్ చరణ్యను వికారాబాద్ పోలీసు స్టేషన్‌కు పిలిపించి ఆరా తీశారు. అల్లం వెల్లుల్లిని ఉపయోగించకుండా కేవలం వెల్లుల్లి పొట్టు, యాసిడ్స్, కెమికల్స్ (ఆజన్‌టాక్స్ టైటానియం డై ఆక్సైడ్, గ్జాంథన్ గమ్ వినియోగించి అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడించారు.


అల్లం, వెల్లుల్లి డబ్బాలను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ కోటిరెడ్డి

దీంతో పోలీసులు అత్తాపూర్‌లోని అజిత్ చరణ్య నివాసానికి వెళ్లి తనిఖీలు నిర్వహించగా, 30 కల్తీ అల్లం, వెల్లుల్లి కాటన్లు, 30 కిలోల అల్లం వెల్లుల్లి పేస్ట్ ఉన్న 4 చిన్న డ్రమ్ములు, కెమికల్స్, యాసిడ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 11.14 క్వింటాళ్ల కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్, కెమికల్స్, యాసిడ్స్‌తో పాటు రవాణాకు వినియోగించిన ఆటోను సీజ్ చేశారు. నిందితులు మనుష్క, అజిత్ చరణ్యపై కేసులు నమోదు చేశారు.

తక్కువ ధరకు విక్రయిస్తే ఆలోచించండి : జిల్లా ఎస్పీ కోటిరెడ్డి

మార్కెట్లో తక్కువ ధరకు లభ్యమైతే ఆలోచించి కొనుగోలు చేయాలని జిల్లా ఎస్పీ కోటిరెడ్డి ప్రజలకు సూచించారు. తాము కొనుగోలు చేసేది అసలైనదా.. నకిలీదా అనేది గుర్తించాలన్నారు. జిల్లాలో కల్తీ, అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలు ఎక్కడ జరిగినా ఉపేక్షించేది లేదని, సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. అక్రమార్కులపై జిల్లా పోలీసులు నిఘా పెట్టారన్నారు. అక్రమ, అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించి ఏమైనా సమాచారం ఉంటే వెంటనే జిల్లా పోలీసులకు లేదా డయల్ 100, లేదా టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్ 8712583483కి కాల్ చేసి తెలియజేయాలని ఎస్పీ కోరారు.

తాండూరులో అస్తవ్యస్తంగా మురుగు నీటి పారుదల

- ఎన్జీటీని ఆశ్రయించిన సామాజికవేత్త
- ఆరుగురు అధికారులకు సమన్లు

తాండూరు, జనవరి 10: తాండూరు పట్టణంలో మురుగునీటి పారుదల వ్యవస్థ దారుణంగా ఉందని, ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని తాండూరుకు చెందిన సామాజికవేత్త రాజ్‌గోపాల్ సారాడ కొన్ని రోజుల క్రితం చెన్నైలో గల జాతీయ హరిత ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ఆరుగురు అధికారులను బాధ్యులను చేస్తూ ఆయన పిల్ వేయగా.. ట్రిబ్యునల్ కోర్టు వారికి నోటీసులు జారీ చేసింది. స్వచ్ఛమైన నీరు ప్రవహించే చిలుకవాగు, కాగ్నా నది చెరువు, గొల్ల చెరువులకు మురుగు నీటిని మళ్లించి కలుషితం చేశారని పిల్‌లో ఆయన పేర్కొన్నారు. మురుగు కాల్వలను క్రమబద్ధీకరించాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని రాజ్‌గోపాల్ కలెక్టర్, ఆర్డీవో, తాండూరు మున్సిపల్ కమిషనర్, నీటి పారుదల శాఖ, కేంద్ర, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండళ్లపై ఆయన కేసు వేశారు. గొల్లచెరువు మొత్తం గుర్రపు డెక్కతో నిండినా దానికి తొలగించడం లేదని, మురుగు నీటి ప్రవాహాన్ని మళ్లించేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ ఖజానా నుంచి రూ.50కోట్లు కేటాయించి తాండూరులో మురుగు నీటి పారుదల వ్యవస్థను ఆధునికీకరించాలని రాజ్‌గోపాల్ డిమాండ్ చేశారు.


తాండూరులో ప్రవహిస్తున్న మురుగు నీరు


తుంకిమెట్లలో హైవేపై ధర్నా చేస్తున్న లారీ డ్రైవర్లు

కేంద్ర చట్టాన్ని వ్యతిరేకిస్తూ లారీ డ్రైవర్ల ఆందోళన

బొంరాస్‌పేట/కీసర/శామీర్‌పేట, జనవరి 10: రోడ్డు ప్రమాదాల బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని లారీ డ్రైవర్లు బుధవారం తుంకిమెట్లలో హైదరాబాద్-బీజాపూర్ 163వ నంబర్ జాతీయ రహదారిపై ధర్నా చేశారు. డ్రైవర్లు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొత్త చట్టాలతో తమ హక్కులను కాలరాస్తున్నారని అన్నారు. లారీల యాజమాన్యాలకు సంబంధం లేకుండా రోడ్డు ప్రమాదం జరిగితే డ్రైవర్లదే బాధ్యత అని కొత్త చట్టంలో ఉందని, దీనికి రూ.7లక్షల జరిమానా, 10 ఏళ్ల జైలు చట్టంలో నిబంధన విధించారన్నారు. ఈ చట్టం అమలైతే తమ కుటుంబాల పరిస్థితి ఏమిటని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాన్ని రద్దు చేయాలన్నారు. వాహనాల చట్ట సవరణను నిరసిస్తూ కీసర ఔటర్ రింగ్ రోడ్డు వద్ద లారీ డ్రైవర్లు ధర్నా చేశారు. తమపై కేంద్ర ప్రభుత్వం కక్షగట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాతో వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు వచ్చి లారీ డ్రైవర్లకు నచజెప్పి ధర్నాను విరమింపచేశారు. హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేసి డ్రైవర్లను ఆదుకోవాలని శామీర్‌పేట మండలం మజీద్‌పూర్ చౌరస్తా వద్ద వాహనాల డ్రైవర్లు ఆందోళన చేశారు. కార్యక్రమంలో డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు శ్రీపతి నగేష్, శ్రీపతి ఉప్పలయ్య, నరసింహ, రవి, సత్యనారాయణ, డ్రైవర్లు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ముందుకుసాగితేనే మంచి ఫలితాలు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 10: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ముందుకు సాగితేనే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని తెలంగాణ గురుకులాల సంస్థ కార్యదర్శి నవీన్ నికోలస్ అన్నారు. అంకుషాపూర్‌లో రెండు రోజుల నుంచి జరిగిన యూత్ పార్లమెంట్ మోడల్ యునైటెడ్ నేషన్స్ సైన్స్ ఫెయిర్ ముగింపు కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విద్యార్థులు బాగా చదివి ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ప్రతీ విషయంలోనూ క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకుసాగితే ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. సందర్భంగా వ్యాసరచన, క్విజ్, నృత్య, సైన్స్‌ఫెయిర్, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఆయన జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ అదనపు కార్యదర్శి హనుమంత్‌నాయక్, సంయుక్త కార్యదర్శి సక్రు నాయక్, రీజినల్ కో-ఆర్డినేటర్లు రజని, నాగలక్ష్మి, శారద, ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రులను కలిసిన ఎమ్మెల్యే

పరిగి, జనవరి 10: పరిగి నియోజకవర్గ అభివృద్ధి గురించి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని, పలువురు మంత్రులను కలిసి వినతిపత్రాలను అందజేశారు. రంగాపూర్‌లో 400 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని, అప్పా నుంచి మన్నెగూడ, మన్నెగూడ నుంచి బీజాపూర్ జాతీయ రహదారి తెలంగాణ 127కిలో మీటర్ల మేర నాలుగు లేన్ల రోడ్డు వేయాలని సీఎంకు వినతిపత్రం అందజేశారు. పరిగిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, వెనుకబడిన ప్రాంతమైన పరిగిలో వంద పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్‌కు వినతిపత్రం అందజేశారు. సీఎం, మంత్రులు తమ వినతులపై సానులకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.


చిన్నారికి సీపీఆర్ చేసి కాపాడిన 108 సిబ్బంది

శిశువుకు సీపీఆర్ చేసిన 108 సిబ్బంది

కీసర, జనవరి10: 108 సిబ్బంది సీపీఆర్ చేసి శిశువు ప్రాణాలు కాపాడిన ఘటన కీసరలో బుధవారం జరిగింది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... దమ్మాయిగూడకు చెందిన దుర్గకు మంగళవారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో కీసర ఆరోగ్య కేంద్రానికి తెచ్చారు. వైద్యులు దుర్గకు సాధారణ ప్రసవం చేశారు. ప్రసవానంతరం శిశువు కదలికలు లేకపోవడంతో వెంటనే 108సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే 108 సిబ్బంది ఈఎన్‌టీ రవి వైద్యనిపుణుల సహాయంతో బిడ్డకు సీపీఆర్(కార్డియో పల్మనరీ రెస్పిరేషన్) చేశారు. శిశువుకు 40 నిమిషాల పాటు సీపీఆర్ చేసి కదలికలు వచ్చేలా సిబ్బంది శ్రమించారు. దీంతో చివరకు శిశువు ఊపిరి పీల్చుకుంది. దుర్గ కుటుంబీకులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



సీలింగ్ భూమిలో నిర్మాణాల కూల్చివేత

కీసర, జనవరి 10: సీలింగ్ భూమిలోని అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు బుధవారం కూల్చివేశారు. చీర్యాల్‌లోని సర్వే నంబర్ 58, 59లలో ఉన్న సీలింగ్ భూమిలో కొందరు రియల్టర్లు 80గజాల చొప్పున ప్లాట్లు చేసి గదులను నిర్మించారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ అశోక్ బుధవారం జేసీబీతో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఎవరైనా సీలింగ్, అసైన్డ్, ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

యాసంగి పంటలను ఆన్‌లైన్ చేసుకోవాలి

ధారూరు, జనవరి 10: యాసంగిలో సాగుచేసిన పంటలను రైతులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ తెలిపారు. రుద్రారంలో బుధవారం యాసంగి పంటలను ఆన్‌లైన్ చేసుకున్న రైతుల పంట పొలాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. యాసంగిలో వేరుశనగ, మొక్కజొన్న, జొన్న, కూరగాయల పంటలు సాగుచేసుకునే రైతులు అధికారులతో పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. వేరుశనగ పంటను పరిశీలించిన ఆయన.. పంటకు వేరుకుళ్లు తెగులు ఆశించిందని గుర్తించి, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈవోలు త్రైలోక్య, సంజూరాథోడ్, రైతులు పాల్గొన్నారు.

27వ నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు అనురాగ్ ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఎంపిక

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 10: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అనీష్‌చంద్ర, సౌమ్య మహారాష్ట్రలోని నాసిక్ నగరంలో జరిగే 27వ నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు ఎంపికయ్యారు. బుధవారం వర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మల్లేష్, స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్ విజయ్ కుమార్‌లు వలంటీర్లను సత్కరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు కిరణ్‌కుమార్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన జిల్లా సైన్స్‌ఫేర్

- జిల్లా స్థాయిలో 312 పాఠశాలల విద్యార్థుల ప్రదర్శన
- ఆద్యాంతం ఆకట్టుకున్న విద్యార్థుల ప్రతిభ
- అలంరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- ప్రత్యేక ఆకర్షణగా బాలికల బంజారా నృత్యం
- విద్యార్థుల సృజనాత్మకతశక్తికి ప్రతిరూపమే విద్యాప్రదర్శనలు
- జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు


కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు

ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల జనవరి 10: విద్యార్థుల సృజనాత్మకత, మేధాశక్తికి ప్రతిరూపంగా విద్యా ప్రదర్శనలు నిలుస్తున్నాయని జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు అన్నారు. గురుకుల విద్యాపీఠ్‌లో రెండు రోజులుగా జరుగుతున్న 51వ జిల్లా స్థాయి సైన్స్, మ్యాథమాటిక్స్, పర్యావరణ ప్రదర్శన బుధవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈఓ సుశీందర్ రావు పాల్గొని మాట్లాడుతూ ఆలోచనలు భిన్నంగా ఉంటే ఆ విష్కరణలు సైతం భిన్నంగా ఉంటాయని అన్నారు. ఇలాంటి ప్రదర్శనలు విద్యార్థులలో పోటీ తత్వాన్ని పెంచుతాయని అన్నారు. మనం అనుభవిస్తున్న విజ్ఞాన ఫలాలు ఎంతో మంది శాస్త్రవేత్తల కృషి శ్రమ ఫలితమని ప్లానటరీ సొసైటీ డైరక్టర్ ప్రొఫెసర్ నేథనియల్ అన్నారు. ఉత్తమ ప్రదర్శనగా నిలిచిన ప్రాజెక్టులకు డీఈఓ చేతుల మీదుగా బహుమతులు ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ రావు, కోఆర్డినేటర్ రాజిరెడ్డి, డిసిఈబి సెక్రటరీ రాంచంద్రా రెడ్డి ,మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి, గురుకుల విద్యాపీఠ్ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు డి.శ్రీనివాస్ రావు, పీఆర్‌టీయూ ఉపాధ్యా సంఘం జిల్లా అధ్యక్షులు గోవర్ధన్ యాదవ్, పాల్గొన్నారు.

కడ్తాల్ ప్రగతి స్కూల్లో ఘనంగా సైన్స్‌ఫెయిర్

కడ్తాల్, జనవరి 10 : మండల కేంద్రంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో బుధవారం వైజ్ఞానిక వస్తు ప్రదర్శన కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించే మేళాను పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ లక్ష్మీనర్సింహ్మారెడ్డి, వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ జి. చెన్నకిషన్‌రెడ్డి, ట్రస్మా రాష్ట్ర ప్రతినిధులు అల్లాజీగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, తల్లోజు వెంకటయ్య, నల్లబోలు సుధీర్‌రెడ్డిలతో కలిసి పాఠశాల కరస్పాండెంట్ కె.సువర్ణగోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు బిను, అధ్యాపకుల బృందం పర్యవేక్షణలో విద్యార్థినీవిద్యార్థులు 162 అంశాలపై ప్రదర్శనలు ఇచ్చారు. ఎంఈవో సర్దార్ నాయక్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగయ్య, అరుణ, లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ సందడి నరేందర్ రెడ్డిలు సందర్శించారు.


కడ్తాల: మేళాను ప్రారంభిస్తున్న సువర్ణగోవర్ధన్ రెడ్డి



ఎమ్మెస్కే ప్రసాద్‌కు ఎంపీపీ సన్మానం

శంషాబాద్ రూరల్, జనవరి 10 : మండలంలోని పెద్దతూప్రలో ఎంపీపీ దిద్యాల జయమ్మశ్రీనివాస్‌ను బుధవారం బోర్డు ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా (బీసీసీఐ) మాజీ అధ్యక్షుడు ఎమ్మెస్కే ప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంపీపీ ఇంటికి వచ్చిన ప్రసాద్‌ను ఎంపీపీ శాలువా కప్పి, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఎంపీపీ భర్త శ్రీనివాస్‌తో ఎమ్మెస్కే ప్రసాద్‌కు సన్నిహిత సంబంధాలు ఉండటంతో ఇంటికి వచ్చినట్లు తెలిపారు. కాగా, బీసీసీఐకి అధ్యక్షుడిగా వ్యవహరించిన ప్రసాద్ ఇంటికి రావడం చాలా సంతోషంగా ఉందని బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్ తెలిపారు. ప్రసాద్ ఇంటికి రావడంతో పెద్దతూప్ర యువకులు ఎంపీపీ ఇంటికి భారీగా తరలి వచ్చారు. ప్రసాద్‌తో సెల్ఫీలు దిగాడానికి ఎగబడ్డారు. అనంతరం ఎంపీపీ ఇంట్లోనే ఎమ్మెస్కే ప్రసాద్ బ్రేక్ ఫాస్ట్ చేసి తిరిగి నగరానికి బయలుదేరి వెళ్లారు.

ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న జంగారెడ్డి

కందుకూరు, జనవరి 10 : మండలంలో అక్రమణకు గురైన ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు ఆధీనంలోకి తీసుకోవడంతో పాటు ప్రజా సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ మాజీ జడ్పీ ఫ్లోర్‌లీడర్, పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి బుధవారం కలెక్టర్ శశాంకకు వినతిపత్రం ఇచ్చారు. ఆ పార్టీ నాయకులతో కలిసి కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జంగారెడ్డి మాట్లాడుతూ మండలంలోని పులిమామిడి రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 77లో 22ఎకరాల 12 గుంటల భూమి ఉందని, అందులో 7 ఎకరాల 13గుంటల ప్రభుత్వం భూమి రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించారని తెలిపారు. అందులో వ్యాపారులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. గతేడాది తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చినా చర్యలు తీసుకోలేదన్నారు. మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు కలెక్టరు దృష్టికి తీసుకెళ్లినట్లు జంగారెడ్డి తెలిపారు. ఎస్.నరేందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'దళితబంధు' నిధులు అకౌంట్లలో జమచేయాలి

కందుకూరు మండలంలో దళితబంధు కింద ఎంపిక చేసిన లబ్ధిదారులకు వారి అకౌంట్లలో నిధులు జమ చేయాలని కోరుతూ బుధవారం కలెక్టర్ శశాంకకు వినతిపత్రం ఇచ్చారు. మండలంలోని 35 గ్రామ పంచాయతీలకు చెందిన 318మంది లబ్ధిదారులకు గతేడాది అక్టోబరులో దళిత బంధు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. వారి అకౌంట్లలో డబ్బు జమ చేయలేదని కలెక్టర్‌కు వివరించారు. లబ్ధిదారులు బర్కం వెంకటేష్, జి.సామయ్య, జి.పారిజాతం, సాయిలు, దేవేందర్, జంగయ్య, రాములు, బి.మహేష్, కందడి నర్సింహ, గాదె రవీందర్, ఎం.బాబయ్య, రామకృష్ణ, శ్రీకాంత్, రాజు, కృష్ణ, నవీన్‌కు మార్ తదితరులు పాల్గొన్నారు.

22న అందరూ దీపాలు వెలిగించాలి

మొయినాబాద్ రూరల్, జనవరి 10: అయోధ్యలోని రాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ రోజున ప్రతీ ఒక్కరు తమ ఇళ్లల్లో దీపాలు వెలిగించాలని చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని చిలుకూరు బాలాజీ ఆలయంలో ఆయన మాట్లాడుతూ హిందువుల ఎన్నో ఏళ్ల కల సాకారం కాబోతున్న వేళ ప్రతీ ఒక్కరు సంతోషంగా గడపాలని, 22ను పండుగ వాతవరణంలో జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

రైతులను ఆదుకుంటాం

యాచారం, జనవరి 10 : సొసైటీని లాభాల దిశగా నడిపించి రైతులను ఆదుకుంటామని మండల సొసైటీ ఛైర్మన్ టి.రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం యాచారం మండల సొసైటీ భవనంలో డైరెక్టర్లతో కలిసి 2024 క్యాలండర్, డైరీలను విడుదలచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న గిడ్డంగిని త్వరలోనే పూర్తి చేసి రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతులకు పంట రుణాలు ఇవ్వడం కోసం తాము చర్యలు తీసుకుంటున్నామన్నారు. సొసైటీ డైరెక్టర్లతో పాటు సొసైటీ సీఈవో నాగరాజు, క్యాషియర్ గణేష్ తదితరులున్నారు.

దీపాదాస్ మున్షీని కలిసిన జగన్

కల్వకుర్తి, జనవరి 10: కడ్తాల మండలం వాసుదేవ్‌పూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు, ఏఐసీసీ ట్రైనింగ్ కో-ఆర్డినేటర్, సీనియర్ న్యాయవాది మల్లెపల్లి జగన్ బుధవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని మర్యాదపూర్వకంగా కలిశారు. గాంధీభవన్‌లో ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపినట్లు పేర్కొన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ టికెట్‌ను తనకు కేటాయించాలని ప్రొఫైల్‌తో కూడిన వినతిపత్రాన్ని మున్షీకి అందజేసినట్లు జగన్ పేర్కొన్నారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్ లోక్‌సభ ఇన్‌చార్జి, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డిలను కూడా కలిసినట్లు తెలిపారు.

డిగ్రీ కళాశాల భవనాన్ని అందుబాటులోకి తెస్తాం

ఇబ్రహీంపట్నం, జనవరి 10: అసంపూర్తిగా ఉన్న ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనాన్ని త్వరలోనే అందుబాటులోకి తెస్తామని కళాశాల విద్య జాయింట్ డైరెక్టర్ ప్రొ.జి.యాదగిరి అన్నారు. బుధవారం డిగ్రీ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనంలో షిఫ్ట్ పద్దతిలో కొనసాగుతున్న డిగ్రీ కళాశాలలో వసతులను పరిశీలించిన ఆయన వినోభానగర్‌లో నిర్మాణంలోఉన్న పక్కా భవనాన్ని అందుబాటులోకి తెచ్చి సమస్యను పరిష్కరిస్తామన్నారు. సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి నూతన భవనంలో మిగిలిన పనులను పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని కోరారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.ప్రభు, అధ్యాపకులు ఉన్నారు.

క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి : వీర్లపల్లి

● కొందుర్గు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

కొందుర్గు, జనవరి, 10: చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కొందుర్గు ప్రీమియర్ లీగ్ సీజన్ 4 క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందుర్గు మండలంలో క్రీడలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని, ప్రతియేట వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ టోర్నమెంట్‌లను నిర్వహించడం అభినందనీయమన్నారు. మండల కేంద్రంలో స్టేడియం ఏర్పాటు కోసం తన కృషి చేస్తానన్నారు. కొందుర్గులో కాలేజీ ఏర్పాటుకు సహకరించాలని, దళితులకు 100 ప్లాట్లు అందజేస్తామన్నారు. అనంతరం టాస్‌వేసి, బ్యాటింగ్ చేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. వైస్ఎంపీపీ రాజేష్‌పటేల్, పీఏసీఎస్ ఛైర్మెన్ దామోదర్‌రెడ్డి, శుభన వెంచర్స్ యాజమాని అనిత, నాయకులు కృష్ణారెడ్డి, యాదయ్య, పెంటయ్య, కె.రాములుగౌడ్, గోవర్ధన్‌గౌడ్, షబ్బీర్,



కొందుర్గు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

మాణయ్య, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతును కంటికి రెప్పలా కాపాడుకుంటాం

షాద్‌నగర్ : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను కంటికి రెప్పలా కాపాడుకుంటుందని ఎమ్మెల్యే వీర్లపల్లి అన్నారు. షాద్‌నగర్ మార్కెట్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.ప్రకాష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. రైతు సంక్షేమం కోసం ఎన్నికల డిక్లరేషన్ ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. మార్కెట్ మర్చంట్స్ అసోసియేషన్‌కు ఎలాంటి సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్ సభ్యులు జగదీష్, చిన్నారెడ్డి, గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రజలకు శాపం

నందిగామ : గత పాలకుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారిందని, వారి కమీషన్ల కోసం అభివృద్ధి పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. మండల కేంద్రంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన ఎంపీడీవో భవన నిర్మాణాన్ని ఎమ్మెల్యే, ఎంపీపీ ప్రియాంక శివశంకర్ గౌడ్, ప్రజాప్రతినిధులు, నాయకులతో కలసి పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయ నిర్మాణం పూర్తయ్యేవిధంగా కార్యచరణ చేపడతామన్నారు. నందిగామ నుంచి వీర్లపల్లి, నర్సప్పగూడ రోడ్లను విస్తరింపజేస్తామన్నారు. మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, ఎంపీటీసీలు కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, ఎంపీడీవో బాల్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి



మాట్లాడుతున్న చల్లా వంశీచంద్ రెడ్డి

ఆమనగల్లు, జనవరి 10: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా కార్మోణ్ముకులై యుద్ధంలో సైనికుల్లా ముందుకు సాగి అంతిమ విజయం సాధించాలని ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచంద్‌రెడ్డి పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల తరహాలో నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని సూచించారు. మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి నివాసంలో ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి వంశీచంద్ రెడ్డి, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, ఉపాధ్యక్షుడు భగవాన్ రెడ్డి లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండలాల కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, పార్టీ బలోపేతం, కార్యకర్తల సమస్యలపై చర్చించారు. వంశీచంద్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ 12 పార్లమెంట్ స్థానాలు కైవసం చేసుకొని ఘన విజయం సాధిస్తుందన్నారు. త్వరలో భర్తీ చేసే నామినేటెడ్ పదవుల్లో పార్టీకి అంకిత భావంతో పని చేసే వారికి అవకాశం లభిస్తుందని చెప్పారు. సమావేశంలో మండలాధ్యక్షులు బీక్యనాయక్, డోకూరు ప్రభాకర్ రెడ్డి, జగన్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు హీరాసింగ్, శ్రీకాంత్, జనార్ధన్, ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షులు షాబొద్దీన్, ఎం.డీ ఫరీద్, నాయకులు లక్ష్మయ్య, భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెంచుల జీవన ప్రమాణాల పెంపునకు కృషి

కడ్తాల్, జనవరి 10: చెంచుల జీవన ప్రమాణాల పెంపే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టి అమలు చేస్తున్న ప్రధాన మంత్రి జన జాతి ఆదివాసీ న్యాయ మహాఅభియాన్ కార్యక్రమాన్ని చెంచులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దార్ ముంతాజ్, సీడీపీవో సక్కుబాయిలు కోరారు. ప్రభుత్వ పథకాలపై చెంచు కుటుంబాలకు అవగాహన కల్పిస్తున్నట్లు వారు తెలిపారు. కడ్తాల మండలం వాసుదేవ్‌పూర్, కర్కల్ పహాడ్ గ్రామాల్లో బుధవారం పీఎం జన జాతీ ఆదివాసీ న్యాయ మహాఅభివయాన్ కార్యక్రమంపై చెంచులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొని చెంచులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. మండలంలోని చెంచు కుటుంబాలందరికీ కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సర్పంచ్ నాగమణి వెంకోబా, ఎంపీటీసీ లచ్చిరామ్ నాయక్, ఏవో శ్రీలత, ఏపీఎం రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల అభివృద్ధికి సహకరించాలి



షాబాద్ : సీఎం రేవంత్‌ను కలిసిన భీంభరత్

షాబాద్, జనవరి 10 : చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ళ నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. బుధవారం నగరంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, స్పీకర్ ప్రసాద్‌కుమార్ లను కలిసి చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని వారిని కోరారు. .

సీఎంతో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి భేటీ

షాద్‌నగర్ : షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో బుధవారం సమావేశమయ్యారు. పలు విషయాలపై వారిరువురూ చర్చించినట్లు సమాచారం. వీరి సమావేశం చర్చానీయాంశంగా మారింది. ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఎమ్మెల్సీ కోసం ఆశిస్తున్నారా? లేక సాధారణంగానే కలిశారా? అని స్థానిక నాయకులు చర్చించుకుంటున్నారు.

కొనుక్కున్న ప్లాట్లలోకి రాకుండా పాత యజమానుల అడ్డగింత

● న్యాయం చేయాలంటూ బాధితుల ఫిర్యాదు

ఇబ్రహీంపట్నం, జనవరి 10: కొనుగోలు చేసిన ప్లాట్లలోకి తమను రానీయకుండా కొందరు అడ్డుపడుతూ బెదిరిస్తున్నారని, తమకు న్యాయం చేయాలంటూ ప్లాట్ల కొనుగోలుదారులు ఇబ్రహీంపట్నం పోలీసులు, తహసీల్దారు కార్యాలయంలో బుధవారం పిర్యాదు చేశారు. నెర్రెపల్లి గ్రామంలో సర్వే నెం. 64-84లో 45 ఎకరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారి కోటేశ్వర్‌రావు 20 ఏళ్ల క్రితం సాయిమిత్ర నగర్, దివ్యసాయి నగర్ పేరుతో వెంచర్‌వేసి ప్లాట్లను విక్రయించగా తాము కొనుగోలు చేశామన్నారు. హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు చెందిన అనేక మంది ఇక్కడ ప్లాట్లు కొనుగోలు చేశారని, 2012లో కోటేశ్వర్‌రావు అనారోగ్యంతో చనిపోయాడని చెప్పారు. గత ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను తీసుకురాగా అప్పటి వీఆర్వో ఈ భూమిని తిరిగి పాత యజమానుల పేరిట ఆన్‌లైన్ చేర్చడంతో వారు పాసు బుక్కులు పొంది, ఈ భూములు వారివేనంటూ తమను బెదిరిస్తున్నారని తమకు న్యాయం చేయాలని ప్లాట్ల యజమానులు డిమాండ్ చేశారు. దీనిపై కోర్టులో కేసులు కూడా ఉన్నాయని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

కన్హా శాంతివనానికి మంత్రి జూపల్లి



ఆధ్యాత్మిక గురువు మహరాజ టోనీ నాడార్‌తో మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే వీర్లపల్లి, తదితరులు

నందిగామ/కొత్తూర్, జనవరి 10: నందిగామ మండల పరిధిలోని కన్హా శాంతివనంలో మహర్షి వేదిక్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బుధవారం మంత్రి జూపల్లి కృష్ణారావు, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. ఆధ్యాత్మిక గురువు మహరాజ టోనీ నాడార్‌తో వారు సమావేశమయ్యారు. దేశవిదేశాల నుంచి సుమారు 10 వేల మంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, నాయకులు జంగ నర్సింలు, హరినాథ్‌రెడ్డి, కావలి కృష్ణ, సుదర్శన్‌గౌడ్ తదితరులున్నారు. కాగా, అంతకుముందు మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి కొత్తూర్ మండలానికి వచ్చిన జూపల్లి కృష్ణారావుకు తిమ్మాపూర్ వద్ద షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఘనస్వాగతం పలికారు. కాంగ్రెస్ పార్టీ కొత్తూర్, నందిగామ మండలాల అధ్యక్షులు గొంగళ్ల హరినాథ్‌రెడ్డి, జంగ నర్సింహా, శివశంకర్‌గౌడ్, సుదర్శన్ గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, కొమ్ము కృష్ణ, అంబటి ప్రభాకర్, దయానంద్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● **కడ్తాల్** : సామాజిక సేవ, ప్రజా చైతన్య కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు పోటీపడాలని కడ్తాల సీఐ శివప్రసాద్, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డిలు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం సర్వ్ స్వచ్ఛంద సంస్థ గ్రామ పంచాయతీ సహకారంతో దివ్యాంగులకు ఉచిత బస్సు పాసులు, వీల్ ఛైర్లు, వాకర్లు, కుట్టు మిషన్లు, దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ హాజరై సర్పంచ్, సర్వ్ సంస్థ నిర్వాహకులు అనిల్‌కుమార్, నీరజ, శ్రీనివాసులుతో కలిసి పంపిణీ చేశారు.

● **చౌదరిగూడ** : క్రీడల్లో గెలుపోటములు సహజమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు అన్నారు. బుధవారం మండల పరిధిలోని రావిర్యాలలో 3వ ఆర్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. నీల నర్సింలు, శివకుమార్, రాఘవేందర్‌రెడ్డి, అనంతయ్య, నీలయ్య, రవికుమార్, భాస్కర్, జంగయ్య, కృష్ణయ్య, వీరన్న, జహంగీర్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

● **చేవెళ్ల** : ప్రభుత్వ పాఠశాలలో స్కావెంజర్లను నియమించాలని టీపీయుఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు గణపురం సురధీర్ అన్నారు. బుధవారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) క్యాలెండర్‌ను చేవెళ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ పనుల కోసం స్కావెంజర్లను నియమించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు లక్ష్మి, జిల్లా కోశాధికారి దూద కృష్ణగౌడ్, రాజశేఖర్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, శ్రీకాంత్, మహిపాల్ రెడ్డి, దయాకర్‌రెడ్డి, మోహన్, రమణారెడ్డి, బస్వరాజ్ తదితరులు ఉన్నారు.

● **చేవెళ్ల** : చేవెళ్ల నియోజకవర్గంలో ప్రజలకు సరిపడా ఆధార్ కేంద్రాలు లేకపోవడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేశ్, జిల్లా అధ్యక్షుడు బేగరి ప్రభాకర్ డిమాండ్ చేశారు. బుధవారం చేవెళ్ల ఆర్డీవో సాయిరాంను కలిసి వినతి ప్రతం అందించారు.

● **షాబాద్** : హోప్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో షాబాద్ జడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన, పోటీల్లో పాల్గొన్న వారికి జ్ఞాపికలను అందజేశారు.

● **కందుకూరు** : క్రీడలు యువతలో ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని కందుకూరు మండల సొసైటీ చైర్మన్ డి.చంద్రశేఖర్ అన్నారు. బుధవారం కందుకూరులో సేవాలాల్‌సేన ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీల్లో ఆకులమైలారం జట్టు విజేతగా నిలవగా వారికి ట్రోఫీ నందించి మాట్లాడారు.

● **షాద్‌నగర్** : తెలంగాణ రాష్ట్ర కార్మిక సంక్షేమ సంఘం ముద్రించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకన్న, సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్‌తో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం సంఘాలు కృషి చేయాలన్నారు.

హామీలపై ప్రభుత్వం కాలయాసన

● మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి

ఇబ్రహీంపట్నం, జనవరి 10: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల నోటిపికేషన్ వచ్చే వరకు గ్యారంటీల పేరిట కాలం ఎల్లదీసే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల కోసం పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని సూచించారు. నాయకులు సత్తు వెంకటరమణారెడ్డి, మహేష్‌గౌడ్, జంగయ్య, కిషన్‌గౌడ్, బుగ్గ రాములు, చీరాల రమేష్ తదితరులున్నారు.

జాతీయ రహదారిపై నేలకొరిగిన మర్రిచెట్టు కొమ్మ

● హైదరాబాద్-బీజాపూర్ హైవేలో ఘటన

● తప్పిన పెను ప్రమాదం



చేవెళ్ల, జనవరి 10 : మండల పరిధిలోని హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై పెద్ద మర్రిచెట్టు కొమ్మ బుధవారం సాయంత్రం రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్రి చెట్టుకు చెందిన ఒక పెద్ద కొమ్మ ఒక్కసారిగా రోడ్డుకు అడ్డంగా పడిపోయినప్పటికీ ఆ సమయంలో రోడ్డుపై వాహనలేవీ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. చేవెళ్ల పోలీస్‌లు సంఘటన స్థలానికి చేరుకుని జేసీబీ సహాయంతో కొమ్మను తొలగించారు.

'అమెజాన్' సేవలు అభినందనీయం

షాబాద్, జనవరి 10 : వైద్యం కోసం అమెజాన్ వెబ్ సర్వీసెస్ అందిస్తున్న సేవలు అభినందనీయమని డీఎంహెచ్‌వో డా.వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సుందరీకరణ కోసం అమెజాన్ వెబ్‌సర్వీసెస్ ఆధ్వర్యంలో కన్సర్న్ ఇండి యా ఫౌండేషన్ సహకారంతో సుందరీకరణ, మౌలిక వసతుల కల్పన పనులను ఏడబ్ల్యూఎస్ డేటా సెంటర్ ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్ కెవిన్‌మిల్లర్, డేటాసెంటర్ ఆసియా, పసిఫిక్, జపాన్, చైనా డైరెక్టర్ సాజిపీకే, డిప్యూటీ డీఎంహెచ్‌వో దామోదర్, ఎంపీడీవో అనురాధ, తహసీల్దార్ చినప్పలనాయుడులతో కలిసి బుధవారం ప్రారంభించారు. వైద్యాధికారి శ్రీనివాస్, సర్పంచ్ సుబ్రమణ్యేశ్వరీరవీందర్, ఎంపీటీసీలు చెన్నయ్య, అశోక్‌లున్నారు.

ఎఫ్‌సీఎన్ ఆధ్వర్యంలో 50వేల మందికి నోట్‌బుక్స్ పంపిణీ



షాద్‌నగర్, జనవరి 10 : స్వామి వివేకానంద 162వ జయంతిని పురస్కరించుకుని ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్స్ సంస్థ ఆధ్వర్యంలో 50వేల మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేసింది. ఫౌండేషన్ చైర్మన్ గీతా తోమాస్‌రెడ్డి మాట్లాడుతూ యువత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. పేద విద్యార్థుల కోసం దాతలు సహాయ, సహకారాలను అందించాలని కోరారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొన్న కారు.. వ్యక్తికి తీవ్రగాయాలు

మాడ్గుల, జనవరి 10 : కారు బైక్‌ను ఢీకొన్న ఘటనలో ద్విచక్రవాహనం నడుపుతున్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండలంలోని నర్సాయపల్లి గ్రామ సమీపాన బుధవారం చోటుచేసుకొంది. నర్సాయపల్లి గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మాడ్గుల గ్రామానికి చెందిన ఏనుక అర్జున్ కొల్కులపల్లి నుంచి నర్సాయపల్లి వైపు వస్తుండగా అదే గ్రామానికి చెందిన అన్నేపాక మహేష్ కారులో నర్సాయపల్లి నుంచి కొల్కులపల్లి వైపు వెళ్తున్నాడు. ఈక్రమంలో బైక్‌ను ఢీకొట్టాడు. దాంతో ఏనుక అర్జున్ తలకు తీవ్రగాయాలయ్యాయి. అతడి కాలు విరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. విషయం తెలుసుకున్న గ్రామ మాజీ ఉపసర్పంచ్ ముక్కెర రాములు అంబులెన్స్‌కు ఫోన్ చేసి చికిత్స నిమిత్తం మాల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే, ప్రమాదం సంభవించిన తర్వాత మహేష్ కారు ఆపకుండా పరారుకాగా, అప్పారెడ్డిపల్లి సమీపాన కారు బోల్తాపడినట్లు గ్రామస్తులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఉపేందర్ ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ ఉపేందర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆమనగల్లు, జనవరి 10: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన కడ్తాల మండల కేంద్రంలో బుధవారం సాయంత్ర చోటుచేసుకుంది. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కడ్తాల మండలం రేఖ్యా తండాకుచెందిన కిష్టియ నాయక్(56) మండల కేంద్రంలోని సినిమా థియేటర్ వద్ద నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న కారు వేగంగా ఢీకొంది. దాంతో కిష్టియ నాయక్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మూడున్నర తులాల పుస్తెలతాడు అపహరణ

కొందుర్గు, జనవరి 10: పొలం వద్ద ఉన్న ఓ మహిళ మెడలో నుంచి మూడున్నర తులాల పుస్తెలతాడు, సెల్‌ఫోన్‌ను దుండగులు అపహరించిన ఘటన బుధవారం మండల పరిధిలోని కొత్త ఆగిర్యాలలో జరిగింది. ఎస్సై కృష్ణ కథనం మేరకు.. కొత్త ఆగిర్యాలకు చెందిన మంచమోని దేవమ్మ సపోట తోట వద్దకు 25 ఏళ్ల వయస్సు గల ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చారు. ఒకతను మోటర్ సైకిల్‌పై నవాబ్‌పేట వైపు నిలబడి ఉన్నాడు. మరొకరు దేవమ్మ దగ్గరకు వెళ్లి కుర్వ మల్లయ్య వ్యవసాయ భూమి ఎక్కడ ఉందని అడిగాడు. మల్లయ్య భూమి ఇక్కడ లేదని చెప్పడంతో, సపోటా పండ్లు కావాలని అడిగి, ఆమె చుట్టూ తిరిగి మెడలో ఉన్న మూడున్నర తులాల పుస్తెలతాడు, సెల్‌ఫోన్‌ను లాక్కుని, మోటర్ సైకిల్‌పై నవాబ్‌పేట్ వైపు వేగంగా వెళ్లినట్లు ఎస్సై తెలిపారు. సంఘటన స్థలాన్ని షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, డీఐ రాంరెడ్డి సందర్శించి వివరాలను తెలుసుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

ఆదిభట్ల, జనవరి 10 : ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో మానసిక వేదనకు గురై ఓవ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో కొంగరకలాన్ బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఆదిభట్ల ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిభట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌కు చెందిన కర్రె మహేష్ (35)బొంగ్లూరులోని ఓ ప్రైవేటు స్కూల్ బస్‌డ్రైవర్‌గా పనిచేస్తుండే వాడు. కొంత కాలంగా డ్యూటీకి సరిగాపోకుండా ఇంటివద్దనే ఉంటున్నాడు. ఉద్యోగం లేకపోవడంతో ఇల్లు గడవడం కష్టంగా మారింది. తన ఇద్దరి పిల్లల స్కూల్ ఫీజులు కట్టకపోవడంతో ఇంటివద్దనే ఉంటున్నారు. దాంతో ఇంట్లో భార్యతో గొడవలు, తదితర సమస్యలతో మానసిక వేదనకుగురై బుధవారం సాయంత్రం 6గంటల ప్రాంతంలో బెడ్రూంలో చీరతో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

వెంచర్ వద్ద ఘర్షణ.. ఎంపీపీ దంపతులపై దాడి

● గాయపడిన ఎంపీపీ అనిత, ఆమె భర్త విజయ్

● పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు

ఆమనగల్లు, జనవరి 10: మండలంలోని మేడిగడ్డ తండా సమీపంలో బుధవారం ఓ వెంచర్ వద్ద జరిగిన ఘర్షణలో నేనావత్ అనిత, ఆమె భర్త విజయ్‌కుమార్‌లు గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ బాల్‌రామ్‌నాయక్ కథనం ప్రకారం.. మేడిగడ్డ తండా సమీపంలో అనుమతులు లేకుండా మౌంట్‌వ్యూ వెంచర్ ఏర్పాటుచేసి ప్లాట్లు విక్రయిస్తున్నారని ఫిర్యాదులున్నాయి. దాంతో ఎంపీవో శ్రీలత, పంచాయతీ కార్యదర్శి వెంకటయ్యలతో కలిసి ఎంపీపీ అనిత, ఆమె భర్త విజయ్ అక్కడికి చేరుకున్నారు. అనుమతులు లేని వెంచర్‌లో ఏర్పాటుచేసిన జెండాలను అధికారులు తొలగింపచేస్తున్న సమయంలో ఎంపీపీని ఉద్దేశించి ఇక్కడికి ఎందుకు వచ్చారని ఎంపీవోను వెంచర్ పర్యవేక్షకుడైన మేడిగడ్డ తండాకు చెందిన రవీందర్ నాయక్ ప్రశ్నించారు. దాంతో ఎంపీపీ అనిత కలగజేసుకోవడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అయితే, రవీందర్ దూషిస్తూ తనతో పాటు, తన భర్త విజయ్‌పై దాడికి పాల్పడ్డారని ఎంపీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడిలో తన భర్త విజయ్ తీవ్రంగా గాయపడ్డారని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు రవీందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, అనుమతులు లేని వెంచర్ విషయంలో చర్యలు తీసుకోవడంలో అధికారుల నిర్లక్ష్యం వివాదానికి, దాడికి కారణంగా స్థానికులు భావిస్తున్నారు. ఎంపీపీ దంపతులు తనపై దాడికి పాల్పడ్డారని రవీందర్‌నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

'నిలువు దోపిడీ' కేసులో నిందితుడి అరెస్టు

మంచాల, జనవరి 10 : నాలుగు రోజుల క్రితం మహిళను బెదిరించి నగలు, నగదు అపహరించుకెళ్లిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా లింగంపేట మండలం, సంగారెడ్డిపేటకు చెందిన కొవ్వూరి లక్ష్మిని ఆటోడ్రైవర్ నమ్మించి ఎంజీబీఎస్ వద్ద తన ఆటోలో ఎక్కించుకుని మంచాల పోలీస్ పరిధి రంగాపూర్ సమీపంలోని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకువచ్చి బెదిరించాడు. అనంతరం ఆమె వద్ద ఉన్న బంగారు పుస్తెలతాడు, సెల్‌ఫోన్, రూ.5వేల నగదు అపహరించుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదుతో మంచాల పోలీసులు 48 గంటల్లోనే కేసును ఛేదించి నిందితుడిని జటావత్ మహేష్‌గా గుర్తించి అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి నగదు, సెల్‌ఫోన్, 29 గ్రాముల బంగారు గొలుసును స్వాధీనం చేసుకుని చోరీకి వినియోగించిన ఆటోను సీజ్ చేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

అర్హత లేకుండానే వైద్యం.. ప్రైవేట్ క్లినిక్‌లో డీసీఏ తనిఖీలు

● రూ57 వేలు విలువచేసే 87 రకాల మందులు స్వాధీనం

ఆదిభట్ల జనవరి 10 : ఎంపీ పటేల్ గూడ లోని ఓ ప్రయివేటు క్లినిక్‌లో బుధవారం తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు తనిఖీలు చేశారు. అర్హత లేకుండా వైద్యం చేస్తున్నట్లు గుర్తించడంతో పాటు లైసెన్స్ లేకుండా మందులు నిల్వచేస్తున్నట్లు గుర్తించి అక్రమంగా నిల్వ ఉంచిన మందులను స్వాధీనం చేసుకున్నారు. ఎంపీ పటేల్ గూడలో కొన్నేళ్లుగా కె.హనుమంతరావు ప్రయివేటు క్లినిక్ నిర్వహిస్తున్నాడు. ఎలాంటి అనుమతులు, అర్హతలు లేకుండా వైద్యం చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు బుధవారం డీసీఏ అధికారులు క్లినిక్‌లో తనిఖీలు నిర్వహించారు. అర్హతలు లేకుండా వైద్యం చేయడంతో పాటు పెద్ద మొత్తంలో విక్రయించడానికి నిల్వఉంచిన రూ.57 వేలు విలువచేసే 87రకాల మందులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తు చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ అంజుమ్ అబిదా, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, నాగరాజు, ఎల్ రాజు తనిఖీలో పాల్గొన్నారు.



క్లినిక్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డీసీఏ అధికారులు